# త్రైలోక్యగీత
# పంచదశాధ్యాయము
# యజ్ఞ విచారయోగము

## త్రైలోక్యా ఉవాచ:-

**దత్తోచ్యతే మహత్సత్యం, వాచా సులభయా త్వయా|**
**కుతో యజ్ఞే ఘృతం దగ్ధం, శబ్ద మాత్రైవ కిం శ్రుతిః? || 15.1||**

[**కుమారి త్రైలోక్య అడిగినది:-** ఓ దత్త దేవ! తమరు పరమ సత్యమును సరళమైన భాషలో వచిస్తున్నారు. ఆయుర్వేదములో మేధాశక్తిని పెంచే ఔషధముగా వాడే నేతిని యజ్ఞములో ఎందుకు దగ్ధము చేస్తారు? వివిధ క్రతువులలో పురోహితులు చేసే వేదమంత్రోచ్చారణకు గల పరమార్ధము కేవలము శబ్దపఠనమేనా? మంత్రార్థవిశదీకరణము అవసరము లేదా?]

## శ్రీశ్రీశ్రీ దత్త స్వామీ ఉవాచ:-

**త్రైలోక్యే! పృచ్ఛసి జ్ఞానే, సదా ప్రాగాగ్రహం వినా |**
**ఘృతం ఘృతాన్నం దేయం హి, క్షుధా వ్యగ్నిః క్షుధాతురే || 15.2||**

[**శ్రీశ్రీశ్రీ దత్త స్వామి వచించారు :-** ఓ త్రైలోక్య! నీవు నిరంతరము ఆధ్యాత్మిక జ్ఞానములో సత్యమును తెలియగోరి, పూర్వభావమాలిన్యము, అంధ విశ్వాసం లేకుండా ప్రశ్నిస్తున్నావు. బాగా నేతితో వండిన ఆహారము నేయి లేదా ఘృతము అనబడును. దీనిని ఆకలిగొన్న వారికి ఆహారముగా అందించగా వారు భోజనము చేసినపుడు, ఆకలి అనెడి అగ్నిలో నేతితో వండిన ఆహారము హుతము (దహనం) అవుతుంది. భావవ్యక్తీకరణ చేయు భాషావిధానములలో ఒక విశేషాంశమైన 'లక్షణ' ప్రాబల్యము చేత 'ఏదేని వస్తువును కలిగి ఉన్నవాడు, వస్తువు పేరుతోనే గుర్తింప

బడతాడు'. ఆపిల్ పళ్ళను కలిగిన (అమ్మే) వాడు, 'ఓ ఆపిల్' అని పిలవబడతాడు. కావున 'నేతితో వండిన ఆహారము నేయి లేదా ఘృతము' అనబడును. మరియు 'ఆకలి అనెడి అగ్ని కలిగిన వాడు అగ్ని' అనబడును. దీనిని బట్టి నేయి అనే పదము యొక్క అర్థము స్థూలముగా నేయి అనే పదార్థము కాదు, అలాగే అగ్ని అంటే స్థూలముగా జడశక్తి లేదా సాధారణ అగ్ని అనేది కాదు.]

**ఋగాద్య మంత్రాత్ భూతాగ్నేః, న హోతృ హవనీయతా |**
**క్షుధార్తో స్యాత్ ద్విధా చిత్త్వాత్, జడత్వాదనలస్య చ ||15.3||**

[ఋగ్వేదములో మొదటి మంత్రము ఏమి చెపుతుందంటే, 'అగ్ని లేదా మంట' అనేది ఘృత సమర్పణములకు గ్రహీత గాను మరియు తానే సమర్పించే దాత గానూ ఉంటుంది అని. *ఒకవేళ ఈ మంత్రములో జడమైన శక్తి అయిన అగ్ని నే ఉద్దేశించి చెప్పినట్లైతే, వట్టి జడమైన అగ్ని, ఏదైనా ఇవ్వగల చైతన్యము గల దాత (హోత) ఎట్లు కాగలదు? హవన సామగ్రి అయిన నేతిని యజ్ఞములో సమర్పించిన తర్వాత తిరిగి తానే ఎలా స్వీకరించి హవనీయము ఎలా కాగలదు?* కావున అగ్ని అని శ్లోకములో చెప్పబడిన పదము యథార్థముగా జడమైన అగ్నిని సూచించదు అని స్పష్టమైనది. మరి మంత్రము సూచించినదేమిటి? అంటే నేతిని (నేయి అని పిలువబడుతున్న నేతితో వండిన ఆహారము) సమర్పిస్తున్న **వానిని**, దానినే తిరిగి స్వీకరిస్తున్న **వానిని** సూచిస్తుంది (**అగ్ని మీళే**...*ఋగ్వేదము*). ఎప్పుడైతే ఆకలిగొన్న వాడు నేతి(నేయి-ఆహారమును)ని భుజిస్తాడో, తానే నేయి(నేయి-ఆహారము)ను సమర్పించిన వాడు గాను, తిరిగి తానే నేతి(నేయి-ఆహారమును)ని స్వీకరించిన వాడు గాను తెలియబడుతున్నాడు. ఇక్కడ ఆకలి అంటే వైశ్వానరాగ్ని అనెడి ఒక విశేషమైన అగ్ని అని భగవద్గీత లో చెప్పబడినది(**అహం వైశ్వానరో భూత్వా...**గీతా). ఆకలిగొన్నవాడే అగ్ని లేదా మంట అని తెలియబడుతున్నాడు. *ఋగ్వేదములో మొట్టమొదటి మంత్రములో అగ్ని స్థానములో ఆకలిగొన్న వ్యక్తిని అర్థముగా*

*ఉంచినపుడే, నేతి (నేయి-ఆహారమును)ని సమర్పించేవాడే నేతిని (నేయి-ఆహారమును) స్వీకరించేవాడు అని మంత్రము పరిపూర్ణముగా అర్థవంతమగుచున్నది.* అంతేగాని, జడమైన అగ్ని, నేతిని భుజించజాలదు మరియు జడమైన అగ్ని తనకు తానుగా కాని లేదా రెండవ వానికి గాని నేయి-ఆహారమును సమర్పించజాలదు. చేతనత్వము కలిగినట్టి ఆకలిగొన్న వ్యక్తికి మాత్రమే నేయి-ఆహారమును స్వీకరించ (**హవనీయము**) సాధ్యమగును మరియు సమర్పించుటకు (**హెూత**) సాధ్యమగును. జడమైన అగ్నికి చైతన్యము లేని కారణము చేత నేయి-ఆహారమును సమర్పించగల హెూత కాగల అవకాశమే లేదు. నేయి ఆహారమును తినుచున్నవాడు మాత్రమే నేయి ఆహారమును సమర్పించు హెూతయు, స్వీకరించు హవనీయము కాగలడు.]

**న నాశోఽన్నస్య చామ్నాయాత్, జడాగ్నిః పాక సాధనమ్ |**
**గీయతే దేవతాగ్నిః క్షుత్, ఘృతం బుద్ధి వివర్ధనమ్ || 15.4||**

[పైగా ఆహారమును వృథా చేయరాదని వేదము చాలా స్పష్టముగా చెప్పినది (**అన్నం న పరిచక్షీత...**వేదము). నేయి చాలా విలువైన ఆహారపదార్థము, ఆయుర్వేద శాస్త్రమును అనుసరించి నేయి మేధాశక్తిని వృద్ధి చేయుటకు ఉపకరిస్తుంది. అంతటి విలువైన ఆహారపదార్థమును జడమైన అగ్నిలో వేసి దగ్ధము చేయటము మహా పాపము. ఈ సందర్భములో నీకొక సందేహము కలుగవచ్చును, మరి యజ్ఞములో భౌతికాగ్నిని ఎందుకు వెలిగిస్తారు? అని. దీనికి సమాధానము, భౌతికాగ్నిని రాజేసి సమిధలు (కర్రముక్కలు) వేసి నేయితో శ్రేష్ఠమైన భౌతికమైన ఆహారపదార్థములు వండటము కొరకు, యజ్ఞమునకు సాధనముగా మాత్రమే భౌతికాగ్ని సహాయ పడుతుంది (యజ్ఞసాధనము). పూజించదగిన అగ్ని (యజ్ఞ ఉపాస్యము) లేదా దివ్యమైన అగ్ని కేవలము వైశ్వానర అగ్ని మాత్రమే, ఇది ఆకలిగొన్న వారిలో కలిగిన క్షుధాగ్ని అని భగవద్గీత బోధిస్తున్నది.]

**ఘృతదీప భాసకాయ, కిమర్థం స్వార్థ భాసి చ |**
**ధీ దీపక జ్ఞాన దీపే, దరిద్రే సార్థకం ఘృతమ్ || 15.5||**

[సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలకు మూల ప్రకాశము భగవంతుడు అని వేదములలో చెప్పబడినది. (**న తత్ర సూర్యో భాతి...**వేదము). అటువంటి భగవంతుని కోసము మీరెందుకు నేతితోను, నూనెతోను దీపాలు వెలిగిస్తున్నారు? జీవాత్మలమైన మనకు వెలుగు అవసరము. మన కొరకు పగలు సూర్యుడు, రాత్రుళ్ళు విద్యుద్దీపాలు వెలుగుతుండగా దేవుని కొరకు మనము నూనె దీపాలు, నేతిదీపాలు వెలిగిస్తున్నాము(దేనికి)! ఏ పరిమాణములో నేయి మరియు నూనెలను నీవు దగ్ధము చేస్తున్నావో అవి గనక పేదవారికి దానము చేసినట్లైతే, దానిని భుజించి వారి మేధాశక్తి చక్కగా బలపడుతుంది, వారిలో జ్ఞాన దీపాలు వెలుగుతాయి. ఇది కదా జరగాలి. ఇది జరిగిన నాడు నేయి, నూనెల కొరకు నీవు చేసిన ఖర్చు కూడా అర్థవంతము అవుతుంది.]

**కేచిన్మూఢాః ఫలం శబ్దాత్, వదంతి స్మృతి వర్ణనమ్ |**
**వ్యర్థశ్రమాయ నిర్దిష్టః, జ్ఞేయార్థశ్చ త్రిభిః పదైః || 15.6||**

[పూర్వమీమాంస అనే ఒకానొక మూర్ఖమైన మార్గము ఉన్నది. అదేమి చెపుతుందంటే వేదము అంటే పవిత్రమైన పదములు, అర్థముతో సంబంధము లేకుండా అవి అద్భుతమైన ఫలితములను (శబ్ద మాత్ర దేవతా) ఇస్తాయి. కాని పవిత్ర గ్రంథములు చెప్పేదేమంటే వేదములను అధ్యయనము చేసి వానిలోని జ్ఞానమును తెలుసుకొనండి అని (**వేదోఽ ధ్యేతవ్యో జ్ఞేయశ్చ**). ఇక్కడ వేదము అంటేనే జ్ఞానము. అధ్యయనము అంటేనే జ్ఞానము. జ్ఞేయము అంటే జ్ఞానము. ఈ విధముగా మూడు సార్లు జ్ఞానము యొక్క ప్రాముఖ్యత వ్యక్తీకరించబడినది. పవిత్ర జ్ఞానమే వేదశబ్దము యొక్క అర్థము. కావున, ప్రతి ఒక్కరికీ ఆ అర్థము అందుట కొరకు గౌణ గ్రంథములైన స్మృతులలో కూడా తిరిగి ఇదే జ్ఞానము చెప్పబడినది. ఒకవేళ మీమాంసకులు అన్నట్లు శబ్దోచ్చారణమే ప్రధానమైతే, అర్థము వివరించుట వేదములకు

అత్యంత ప్రాముఖ్యమైన లక్ష్యము కాకపోతే, స్మృతుల ద్వారా మళ్ళీ వేదముల సారమును చెప్పడానికి అంత శ్రమ ఎందుకు తీసుకోబడినది?]

**న మహత్ త్రిగుణం సూత్రం, త్రిగుణోపాధి సూచకమ్ |**
**యతిభి స్త్యజ్యతే పూజ్యైః, తల్లక్ష్యార్థ ప్రమా బుద్ధైః || 15.7||**

[కొన్ని ఇతర కులముల వారికి గాని మరియు తమ కులములోనే స్త్రీలకు గాని అధికారము లేనటువంటి మూడుపోగులు గల యజ్ఞోపవీతము (జందెము) ధరించినందుకు, అజ్ఞానులైన పురోహితులు వ్యతిరేక విమర్శలను చేస్తారు. నిజంగానే జందెము అంతటి మహత్తరమైనది అయితే తమ సొంత కులములోని త్యాగులైన సంన్యాసులు ఎందుకు వాటిని త్యజించారు? అటువంటి సంన్యాసులు ఈ పురోహితుల చేత పూజింప బడుతున్నారు కూడా! కావున పురోహితులు మూడుపోగుల జందెము యొక్క పరమార్థమును నిజానికి తెలుసుకోలేదని స్పష్టమవుతున్నది. సత్త్వము (చైతన్యము), రజస్సు (జడశక్తి), తమస్సు (జడ పదార్థము) అనే మూడు ప్రాథమిక స్వభావములతో కూడిన మానవ శరీరములో మాత్రమే ఉన్న అనూహ్యమైన పరమాత్మను జీవాత్మ అందిపుచ్చుకోవాలి అని ఈ మూడు పోగులు తెలియ జేస్తున్నవి. అంటే వర్తమాన నరావతారమైన సద్గురువును జీవాత్మ పట్టుకోవాలి, వారి నుండి సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానమును పొందాలి అని సారాశము కనపడుచున్నది. ఇలా యథార్థమైన అంతరార్థమును తెలుసుకున్న తర్వాత, ఈ సిద్ధాంతమునకు ప్రతీకాత్మకమైన మూడు పోగుల జందెమును ధరించిన ఋషులు సత్యసాక్షాత్కరము పొందిన తర్వాత దాని ప్రయోజనము పూర్తిగా నెరవేరినది కావున ఇక యజ్ఞోపవీతము (జందెము)ను అవసరము లేదని తీసివేసినారు. మరి అలాంటప్పుడు, నేటి కాలములో ఇతర కులాల వారిని, స్త్రీలను జందెము వేసుకునే అర్హత లేనివారని, అట్టి అర్హత తమకు

మాత్రమే ఉన్నదని రెండు వర్గాలను (1. శూద్రులు 2. అందరు స్త్రీలు) బాధించుట భావ్యమేనా?]

**జీవహింసా మహాపాపం, ఓషధీభ్య ఇతి శ్రుతిః |**
**శ్రుతం పశుత్వమాజ్యం చ, దోషో మాంసే చ విశ్రుతః || 15.8||**

[ఆహారము కొరకు ఇతర శాకాహార ప్రత్యామ్నాయములు పుష్కలముగా దొరుకుతూ ఉండగా జీవించి ఉన్న ప్రాణులను చంపితినడము మహాపాపము అని ధర్మశాస్త్రము ఘోషించుచున్నది (***అహింసా పరమో ధర్మః***). మొక్కలలో నాడీవ్యవస్థ లేనందున చైతన్యము ఉండదు. మొక్కలలో కూడా జీవము ఉంది కాబట్టి వాటిని ఆహరముగా తీసుకోవడము కూడా పాపమే అని కొందరు వాదిస్తారు. మరి వేదములు ఎందుకు మొక్కలను ఆహారముగా తీసుకోమని మానవులకు సూచించాయి? (**ఓషధీభ్యోఽన్నమ్.**) మానవులలోని పశుతత్త్వమును యజ్ఞములో బలిదానము చేయమని వేదము తెలుపుతున్నది కాని స్థూలార్థములో పశువునే బలి ఇమ్మని కాదు. అలాగే వేదము, యజ్ఞములో కోరికలను దగ్ధము చేయమన్నది కాని నేతిని కాదు. (**మన్యుః పశుః, కామ ఆజ్యమ్...**వేదము). పశుత్వమును చంపుకొనుటకు ప్రతీకగా పిండితో పశువును చేసి (పిష్ట పశువు) దానిని కత్తితో కోయుట అను యజ్ఞ ఆచారము సత్యార్థమును తెలుపుచున్నది. యజ్ఞములో చంపవలసిన పశువగు మేకగా అజా శబ్దమునకు అజ్ఞానులు అర్థమును కల్పించచున్నారు. అజా శబ్దమునకు అర్థము మొలకెత్తుటకు పనికిరాని, మూడు సంవత్సరములు దాచిపెట్టిన ధాన్యము యొక్క పిండి (దేనితో మేక యొక్క విగ్రహమును తయారుచేయు చున్నారో) అని తీసుకొనుట పండితులకు సమ్మతము. వర్తమానకాలములో వైద్యశాస్త్రవేత్తలు ఎందరో మంచి ఆరోగ్యమునకు మాంసాహారము మంచిది కాదు అనే సత్యమును ప్రచారము చేస్తున్నారు. ]

**పూజార్థ యజ్ఞే నో హింసా, నాఽన్నదాహశ్చ సోఽర్చితః |**

## శబ్దేన స్ఫటికే భిన్నే, పౌనఃపున్యస్య విజ్ఞతా|| 15.9||

[యజ్ఞము లేదా బలిదానము అనగా అర్థమేమిటంటే, సద్గురువు అని గుర్తింపబడిన ఒకానొక నరుని అవతారములో వచ్చిన భగవంతుని పూజించడము. అంతే తప్ప జంతువులను బలి ఇవ్వడము కాని లేదా విలువైన ఆహారపదార్థము అయిన నేయిని అగ్నిలో వేసి దగ్ధము చేయడము కాదు. పూర్వమీమాంసకు గల ఆధునిక అభిమానులు కొందరు పూర్వకాలము నుండి ఉన్న సంప్రదాయములను అన్నింటినీ గ్రుడ్డిగా బలపరుస్తారు. వారేమంటారంటే - వేదమంత్రోచ్చారణతో స్ఫటికములు కూడా పగులుతాయని, అసలు వేదములోని శబ్దాలకే అంతటి అద్భుతమైన శక్తి ఉంది అని అంటారు. ఈ ప్రయోగములో కేవలము శబ్దమునకే అటువంటి శక్తి ఉందని నీవు ఎలా సిద్ధాంతీకరించగలవు? ఒకానొక నిర్దిష్ట పౌనఃపున్యము గల శబ్దమునకు అటువంటి సామర్థ్యము ఉండుట పూర్తిగా విజ్ఞానములో భౌతికశాస్త్రీయమైన అంశము, నీవెవరైనా నాస్తికులతో ఇట్టి ప్రయోగమును పునరావృతము చేసి అదే శబ్దమును అదే పౌనఃపున్యంతో ఉచ్చరించమనవచ్చును. అలా ఉచ్చరించినపుడు స్ఫటికము పగిలినపుడు శబ్ద పౌనఃపున్యముతో సరితూగిన స్ఫటికము యొక్క సహజ పౌనఃపున్యము సిద్ధించినపుడు స్ఫటికమును విచ్ఛిన్నము చేసిన కారణము పూర్తిగా భౌతిక శాస్త్రీయ విషయమని నీవు ధ్రువీకరించగలవు.]

## స్వరాత్ సమాస విజ్ఞానం, శాస్త్రాత్ వ్యాకరణాద్ధి తత్ | విభూతిర్భగవత్కామాత్, న స్వరా జ్జడశక్తిజాత్ || 15.10||

[పూర్వమీమాంస సాధకులు కొందరు, వైదిక శ్లోక ఉచ్చారణలో *'ఇంద్రశత్రో'* అను మంత్రములో స్వరమును మార్చినందున దేవుడైన ఇంద్రుడు వృత్రాసురుడను రాక్షసుని హతమార్చినాడని వాదిస్తారు. నిజానికి అప్పుడు చేసిన యజ్ఞ క్రతువు ఇంద్రుడిని, వృత్రాసురుడు హతము చేయుట కోసము తలపెట్టబడినది. ఈ సందర్భముగా వారు చెప్పేదేమంటే శబ్దము యొక్క ఉచ్చారణ

స్వరమును మార్చుటతో, అర్థముతో పని లేకుండానే అద్భుత ఫలితాలు పొందవచ్చును అని. ఇది పూర్తిగా అసంబద్ధము. ఇక్కడ పురోహితులు వృత్రుని సంహరింపగోరి శబ్ద స్వరమును మార్చినారు. అంటే అర్థమును మార్చినారు, యాంత్రిక ఉచ్చారణగతిని మాత్రమే కాదు. '*ఇంద్ర*' అను పదమును నొక్కి చెప్పడముతో, దాని అర్థము శత్రువైన ఇంద్రుడు వృద్ధి చెందాలి (***ఇంద్ర*** *శత్రో వర్ధస్వ*) అని ఫలించినది. ఇక్కడ శత్రువైన ఇంద్రుడే ప్రముఖుడు అయినాడు. ఇక్కడ సమాసము, ప్రథమా తత్పురుషము. ఒకవేళ '***శత్రో***' అనే పదము నొక్కి పలికితే షష్ఠీ తత్పురుష సమాసము అగును. అంటే, ఇంద్రుని శత్రువు వృద్ధి చెందాలి అను అర్థము వచ్చును కావున వృత్రుడే ప్రముఖుడై ఇంద్రుని చంపాలి అను భావము వచ్చును. వ్యాకరణ జ్ఞానము సహాయముతో పురోహితులు ఇలా మార్చారు గాని ఫలితము యాంత్రికమైన శబ్దశక్తి వలన మాత్రము రాలేదు. ఎందుకంటే సురుడైన ఇంద్రుడు మంచివాడు, అసురుడైన వృత్రాసురుడు రాక్షసుడు. అద్భుతమైన శక్తి ఎప్పుడైనా పూర్తిగా భగవంతుని అధీనములోనే ఉంటుంది, కాని కేవల యాంత్రికమైన శబ్దమునకు వశమై ఉండదు. యజ్ఞము ఎలా చేసిననూ ఇంద్రుడు వృత్రాసురుని హతమార్చాలన్నది భగవంతుని దృఢనిర్ణయము కావున ఇదే జరిగి తీరుతుంది. పురోహితులు ఒకవేళ వృత్రుని విజయము కోరి యజ్ఞమును చేసి ఉండినను కూడా అంతిమ ఫలితము భగవంతుడు కోరిన వృత్రసంహారము మాత్రమే అయి ఉండెడిది. ఏలననగా, వేదశబ్ద స్వరములు కానీ వేదమును ప్రసారము చేసిన ఋషులు కానీ, భగవంతుని కన్నా శక్తిమంతులు కారు.]

**పఠనా ద్రక్షితో వేదః, ప్రక్షేపో ముద్రణా న్న హి |**
**ముద్రితం పఠ్యతాం కాలో, యుజ్యతాం జ్ఞాన కర్మణి || 15.11||**

[వేదములను గుడ్డిగా కంఠస్థము చేయడము ద్వారా ముందు తరాలకు అందించే ప్రక్రియ పూర్వకాలములో ధర్మబద్ధమైనది.

ఎందుకంటే, ఆ రోజులలో ముద్రణవ్యవస్థ అందుబాటులో లేదు కాబట్టి, ముందు తరాలకు అందించుటకు గ్రంథమును పరిరక్షించగల ఏకైక విధానము కంఠస్థము చేయడము మాత్రమే. గ్రంథము తాళపత్రముల పైన వ్రాయబడినప్పటికీ, కాలాంతరములో ఎవరైనా తమ ఉద్దేశాలను అదనముగా చేర్చగల అవకాశమున్నందున కంఠస్థము చేయడమే శ్రేష్ఠమని అప్పట్లో విజ్ఞులు తలచేవారు. కావున వేదము ఏమాత్రము కలుషితము కాలేదు. వేదములను కంఠస్థము చేసి పరిరక్షించిన పూర్వకాలములోని జ్ఞానులకు మనము సర్వదా కృతజ్ఞత చెల్లించుకోవాలి. కాని ఇప్పుడు ముద్రణ సౌకర్యము ఉన్నందున బయటి నుండి ప్రక్షేపములు (కొత్త అంశములను వేదములో దూర్చుట) జరుగుతుందనే భయము అసలు లేదు. కావున ఇప్పుడు వేదములను గ్రుడ్డిగా కంఠస్థము చేయడము ఆపి జ్ఞాన సాధకులు వేదముల అద్భుతమైన జ్ఞాన సారాంశమును అధ్యయనము చేయడము ఆరంభించాలి. మరియు మూర్ఖమైన వల్లె వేసే పద్ధతి అయిన అంధకంఠస్థ సంప్రదాయమును వర్తమాన పురోహితులు మాని అర్థవంతముగా వేదజ్ఞానమును తెలియచెప్పాలి.]

**ప్రక్షేపో లిఖితే పత్రే, స్యా న్ముద్రణ నిరాకృతమ్ |**
**నిషేధః పఠనే యుక్తః, కిమన్యత్ర ఫలచ్యుతిః? || 15.12 ||**

[కొందరంటారు - పురోహితులు తాళపత్రములను చూసి గాని, ముద్రింపబడిన పుస్తకమును చూసి గాని వేదములను వల్లె వేయరాదు అంటూ, **గీతీ లిఖిత పాఠకః** అనే శ్లోకమును ఉటంకిస్తారు. ఇలా చెప్పడము తాళపత్రములపైన గ్రంథము వ్రాయబడే రోజులకు మాత్రమే వర్తిస్తుంది. అలా వ్రాయబడే రోజుల్లో అప్రామాణిక అంశములు చొప్పించే అవకాశము మెండుగా ఉండేది. కావున వ్రాతప్రతిని చూసి చదువుటకు అభ్యంతరము చెప్పేడివారు. ఎందుకంటే అట్టి వ్రాత ప్రతులు చాలా చాలా అరుదుగా ఉండేవి, కాబట్టి కలుషితము అయ్యే అవకాశము చాలా ఎక్కువగా ఉండేది. కాని ఇప్పుడు వందలాది ముద్రిత ప్రతులు

అందుబాటులో ఉంటాయి కనుక గ్రంథాలు కలుషితమయే అవకాశమును కలలో కూడా ఊహించలేము. కావున వర్తమాన యుగములో అట్టి ముందుజాగ్రత్త సందర్భమునకు తావే లేదు. మరియు ఇతర మతములందు పురోహితులు గ్రంథవ్రాతప్రతులను చూసి చదువుతారు, ఆధ్యాత్మిక జ్ఞానము యొక్క అర్థమును వివరిస్తారు. మరి ఆయా గ్రంథములు భగవంతుని అనుగ్రహమును సాధించడములో పనికివచ్చుట అందరికీ కనిపించుచునే ఉన్నది కదా! ఇంకా కూడా అర్థమేదో తెలియకుండా వైదిక గ్రంథములను గ్రుడ్డిగా వల్లెవేస్తూనే భగవంతుని అనుగ్రహమును పొందగలమంటారా?]

**ఉభౌ స్త్రీణాం నిరుద్ధౌ తౌ, స్త్రీష్వేవ స్థః న పుంసి హి |**
**గానం చ పచనం తత్త్వం, స్వగర్తపతనం ధ్రువమ్ || 15.13||**

[అహంకారము, అజ్ఞానము గల కొందరు పురోహితులు గాయత్రి మంత్రమును, యజ్ఞ సమర్పణములను చేసే యజ్ఞాధికారము వేరే కులాలవారికి మరియు స్త్రీలకు చెందదని చెప్పి వారిని గాయత్రి ఉపాసనకు దూరము చేసినారు. నిజానికి గాయత్రి కాని, యజ్ఞము కాని స్త్రీల కొరకే ఉద్దేశించబడినవి కాని పురుషుల కొరకు కాదు. గాయత్రి అంటే మధురగీతముల గానము ద్వారా భగవంతుడిని ఆరాధించడము మరియు యజ్ఞము అంటే భౌతికాగ్నిని వెలిగించి ఆహారమును వండి ఆకలిగొన్న దివ్యజిజ్ఞాసులకు వడ్డించి వారి ఆకలిని శాంతింపజేయుట. ఒకవేళ మనము ఈ దివ్యమైన క్రతువుల యథార్థ జ్ఞానమును అర్థము చేసుకుంటే ఈ రెండు విషయములు పురుషుల వద్ద లేవు, స్త్రీల దగ్గర మాత్రమే ఉన్నాయని స్పష్టమవుతున్నది. భగవంతుని కీర్తిస్తూ స్త్రీలే మధురమైన గానము చేస్తుంటారు మరియు ఆకలిగొన్న వారికి వండి వడ్డిస్తుంటారు. కావున పురుషులైన పురోహితులు దేనిని (గాయత్రి) , ఎవరికి (స్త్రీలకు మరియు ఇతర నిమ్న వర్గాలకు) చేరకుండా నిషేధించారో అవి వాస్తవంగా వారి వద్ద మాత్రమే ఉన్నాయి, కట్టడి

చేసినట్టి పురుషులైన పురోహితుల వద్ద లేవు. ఎవరు తీసిన గోతిలో వారే పడతారు అనేదే భగవంతుని తీర్పు.]

**సద్గురౌ హి క్షుధా శాంతే, దేవతృప్త్యంబుద శ్రుతేః |**
**అన్యథా ధూమ కాలుష్యాత్, విజ్ఞానోక్త మవర్షణమ్ || 15.14||**

[యజ్ఞాది క్రతువులు చేయడము వలన, భౌతికాగ్నిలో నేతిని దగ్ధము చేయడము వలన భూమి పైన వర్షాలు పడతాయని, తద్ద్వారా పంటలు వృద్ధి చెందుతాయని, భగవద్గీతలో చెప్పబడినదనే విశ్వాసము ఒకటి ప్రాచుర్యములో ఉన్నది. మేము ఈ సిద్ధాంతమును ఖండించడము లేదు, ఒక్కటి తప్ప - అది యజ్ఞమునందు భౌతికాగ్నిలో నేతిని దగ్ధము చేయడము. విలువైన ఆహారమును కేవలము ఆకలిగొన్న వారి ఆకలిమంటలో వేసి దగ్ధము చేయాలి. ఒకవేళ ఆహారము భౌతికాగ్నిలో కాలితే, వచ్చే పొగ వాతావరణమును కలుషితము చేయడమే కాదు, వర్షాలు పడకుండా కూడా వాతావరణమును ప్రభావితము చేస్తుందని శాస్త్రీయముగా నిరూపించ బడినది. ఇదే ఆహారము సద్గురువు లేదా నరావతారమైన భగవంతుని ఆకలి అనెడి అగ్నిలో దగ్ధమైనట్లైతే పుష్టిగా వర్షాలు పడతాయి. ఎందుకంటే భగవంతుని అవతారమైన ఆ సద్గురువు శరీరంలో ఉన్న సర్వ దేవతలు సంతోషిస్తున్నారు అని వేదము తెలుపుతుంది (**యావతీ ర్వై దేవతాః..**వేదము). ఈ దేవతలలో ఉన్న ఇంద్రుడు వర్షములను కురిపించును.]

**వేదధర్మ కరః కృష్ణః, యజ్ఞాన్నం యాచతే మఖాత్ |**
**క్షుధార్త మిత్ర తృప్త్యర్థం, మాత్రే కపిల బోధితమ్ || 15.15||**

[వేదధర్మమును సంస్థాపించుట కొరకే కృష్ణుడు జన్మించాడు అని గీతలో చెప్పబడినది. ఆయన ఎప్పుడూ, ఏ విధముగానూ వైదిక క్రతువును అడ్డగించడు. అలాంటప్పుడు, ఋషుల భార్యలు యజ్ఞములో హవిస్సుల కొరకు ఆహారము వండుచుండగా (యజ్ఞ

భౌతికాగ్నిలో దగ్ధము చేయుట కొరకు), కృష్ణుడు, ఆకలిగొన్న తన స్నేహితులతో కలిసి వెళ్ళి తమకు ఆ భోజనము వడ్డించగలరేమోనని అడుగుతాడు. దీని అర్ధము ఏమిటంటే కృష్ణుడు భౌతికాగ్నిలో ఆహారమును దగ్ధము చేయకూడదని, దానిని జీవచైతన్యము కలిగినట్టి ఆకలిగొన్న వారి క్షుధాగ్నిని తీర్చమని చెపుతున్నాడు. విష్ణు భగవానుని అవతారమైన కపిలముని తన తల్లికి ఆధ్యాత్మిక జ్ఞానమును బోధించు సమయములో కూడా ఆహారమును భౌతికాగ్నిలో దగ్ధము చేయడము అజ్ఞానము మరియు మూర్ఖత్వము అని చెప్పినారు.]

**త్యాగ యజ్ఞా హి గీయంతే, గ్రహణార్థే ప్రమోదదాః |**
**అగ్నిశబ్ద శ్రుతో చిత్త్వే, దేవాక్ష బ్రాహ్మణా ఽతిథౌ||15.16||**

[యజ్ఞము లేదా బలిదానము అంటే భౌతికాగ్నిలో వేసి ఏదైనా కాల్చడము అని అర్ధము కాదు. అర్హులైన వారికి విలువైన వస్తువును సమర్పించడము. ఈ విషయము ఆధారముగా ఎన్నో విధాలైన యజ్ఞములు గీతలో తెలుపబడినాయి. (**ఏవం బహు విధా యజ్ఞాః..**). ఇంకా చెప్పాలంటే ఈ ప్రపంచము నుండి విషయ సంగ్రహణము చేసి ఇంద్రియాలు ఆనందము పొందడము కూడా యజ్ఞము లేదా సమర్పణము అని చెప్పబడినది. అయితే ఇక్కడ యజ్ఞములోని జడ భౌతికాగ్ని హవిస్సులు స్వీకరిస్తూ ఆనందము పొందలేదు. అట్టి ఆనందమును పొందగల ఇంద్రియములు కేవలము చేతనమైన శరీరమునందు మాత్రమే కలవు (**ఇంద్రియాగ్నిషు జుహ్వతి...**గీతా). కావున, యజ్ఞ సందర్భములో చెప్పబడిన అగ్ని శబ్దము జడమైన అగ్నిని సూచించదు. సరిగా ఇదే సూత్రము ఆధారముగా ఆహారమును స్వీకరించి భుజిస్తున్నదే వైశ్వానరాగ్ని, ఇలా ఆనందిస్తూ చేస్తున్న భోజనమే యజ్ఞము. మరి భౌతికాగ్ని తనకు అర్పితమైన భోజనమును ఆనందిస్తూ ఆస్వాదించ గలదా? వేదములలో స్పష్టముగా చెప్పబడినది ఏమంటే సమస్త దేవగణములు తనయందు కల సద్గురువు, తనకు నివేదించిన భోజనమును ఆనందిస్తూ సమస్త దేవతలను తన

ద్వారా అదే ఆహారమును ఆరగింపజేస్తూ ఆస్వాదింపజేస్తున్నారని ఆనందింపజేస్తున్నారని అర్థము (***యావతీ ర్వై దేవతాః...***). సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానము గల వ్యక్తి బ్రాహ్మణుడు అనబడును, అతడు కూడా 'అగ్ని' అని వేదములో చెప్పబడినది. (**ఆగ్నేయో వై బ్రాహ్మణః....**వేదము). ఆకలితో వచ్చిన అతిథి వైశ్వానరుడు అనెడి అగ్ని అని కూడా వేదములో చెప్పబడినది (**వైశ్వానరః ప్రవిశత్యతిథిః...** వేదము).]

**దైవసృష్టే కులే దైవం, న ముఖ్యం సృష్టి కారణాత్ |**
**గుణ కర్మ కారణం హి, న భంగో వో మతస్య హి || 15.17||**

[కులవ్యవస్థకు సంబంధించి, కొందరు మూర్ఖులైన పురోహితులు, భగవంతుడే జీవుల గుణస్వభావముల ఆధారంగా ఇప్పటి కులవ్యవస్థను సృష్టించాడు కావున ఉత్తమ జీవాత్మలు అగ్రకులస్థులు గాను, చెడ్డ జీవాత్మలు నిమ్న కులస్థులుగాను సృష్టించాడని అంటుంటారు. **మేము** దీనిని ఒప్పుకుంటాము, కాకపోతే ఉత్తమమైన జనులు అందరూ అగ్రకులాలకే చెందిన వారని నిరూపించాలి. ఇంకా చెడ్డ వారంతా నిమ్న కులాలకు చెందిన వారే అని కూడా నిరూపించాలి. కుటుంబ వాతారణము జీవాత్మ యొక్క గుణస్వభావములను ప్రభావితము చేస్తున్నది కదా, కావున అగ్ర కులాలలో పుట్టిన వారు సహజముగానే అక్కడి మంచి వాతావరణ ప్రభావముచేత ఉత్తములై ఉంటారు అనే అవకాశము నీకు ఉన్నది. **మేము** దీనితో పూర్తిగా ఏకీభవిస్తాము, కాని ఏదేని ఒక జీవాత్మ యొక్క మంచి గుణస్వభావముల ఆధారముగానే **మేము** తన కులమును నిర్ణయిస్తున్నాము కావున నీకేమీ అభ్యంతరము ఉండకూడదు కదా! ఎందుకంటే ఒక మంచి జీవాత్మ మంచికులములో పుట్టి మంచి కుటుంబము చేత పెంచబడినట్లైతే సహజముగానే అట్టి జీవాత్మ చివరికి మంచి గుణస్వభావములనే కలిగి ఉండి తీరాలి. ఇక్కడ ప్రజలు చేస్తున్నది ఏమిటంటే భగవంతుడే ఈ కులవ్యవస్థను స్థాపించాడని అంటున్నారు, కానీ గుణస్వభావముల ఆధారముగా కులవ్యవస్థను ఏర్పరచినాడు అనే సిద్ధాంతమునకు మాత్రము

ప్రాధాన్యతను ఇవ్వడము లేదు. భగవంతుడు ఏ నియమమును (గుణస్వభావములు) అనుసరించి కులవ్యవస్థను ఏర్పరచినాడో అనే కీలకవిషయమును విస్మరించి కేవలము కులవ్యవస్థ ఏర్పరచినది భగవంతుడే అనే నిర్ధారణకు మాత్రమే ఎంతో ప్రాముఖ్యతను ఇస్తున్నారు. భగవంతుడే కులవ్యవస్థలో గుణకర్మలపై ఆధారపడినాడు అన్నపుడు గుణకర్మలే ప్రధానమగును.]

**ప్రామాణ్యం సమయా న్నైవ, తమసో వా పరంపరా |**
**ప్రహ్లాదస్యేవ యోగోఽపి, శిష్టాచార స్సుతర్కితః || 15.18||**

[పూర్వీకులైన ఋషులలో మంచి సంప్రదాయములు మరియు కలియుగములోని పురోహితులలో చెడు సంప్రదాయములు ఉన్నాయి. ఏ విధముగా అయితే హంస తన విశేష ఆంతరంగిక ప్రతిభ చేత పాల నుండి నీటిని వేరుచేయగలదో, అదే విధముగా జీవాత్మ కూడా తన అంతర్లీనమైన ప్రతిభ చేత సంప్రదాయములలో ఏది మంచిదో, ఏది చెడ్డదో అనే సత్యమును ఎల్లప్పుడు పదునైన తర్కవిశ్లేషణ ద్వారా తెలుసుకోవాలి. ఏదైనా సంప్రదాయము అనాది నుండి ఆచారముగా వస్తున్నది అని లేదా చాలా కాలము నుండి ప్రీతితో పాటించబడుతున్నది అనే కారణము చేత కానీ అది సరియైన సంప్రదాయము అని స్వీకరించరాదు. వంద సంవత్సరముల నుండి పూర్తిగా మూసి, తాళము వేసి ఉన్న గదిలో సహజముగానే చీకటి ఉంటుంది. తలుపును తెరచిన మరుక్షణము సూర్యరశ్మి ప్రవేశించి గదిలో వెలుతురు నెలకొంటుంది. ఇంతకాలముగా ఉంటున్నానని చట్టరీత్యా హక్కు కారణముగా ఆ గది తనదే అని, ఇంటిలో చేరిన అద్దెవాని మాదిరిగా చీకటి గదిని వీడకుండా పోరాటము చేయదు. భగవంతుడు గీతలో సరియైన యోగ్యతకు సంబంధించిన యోగ సిద్ధాంతములను సవివరముగా తెలిపి, అట్టి యోగమే చిరకాలముగా వస్తున్న సంప్రదాయము అని బోధించారు. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, కేవలము చాలాకాలముగా

వస్తున్న సంప్రదాయము అనే ఒక్క యోగ్యతతోనే అది ఆచరణీయమైన సంప్రదాయముగా నిర్ణయిస్తే, మరి తన రాక్షసకులములో చిరకాలముగా ఎన్నో తరాల నుండి విష్ణుభగవానుని ద్వేషించే సంప్రదాయమును ప్రహ్లాదుడు ఎందుకు నిరాకరించాడు? ఒకవేళ ఏదైనా మంచి సంప్రదాయము చిరకాలముగా వస్తున్నదంటే స్వీకరించవలసినదే, దానినే శిష్టాచారము అంటాము. చిరకాలముగా మూసి ఉన్న గదిలో విద్యుద్దీపము వెలుగుచుండగా, తెరచినపుడు ప్రవేశించిన సూర్యరశ్మి విద్యుద్దీపకాంతిని పారదోలదు.]

**ద్వైవార్థ యజ్ఞే వేదోఽర్థః, కర్మా కర్మ వికర్మణామ్ |**
**రణో యజ్ఞో న స్వకర్మ, వికర్మ ఫలమత్ర నో || 15.19||**

[కర్మ అనే పదముకు ముఖ్యముగా రెండు అర్థాలు ఉన్నాయి. 1. భగవంతునికి సంబంధించిన కర్మ లేదా నివృత్తి మరియు 2. జీవనము గడుపుటకు ఆవశ్యకమైన ప్రాపంచిక కర్మ లేదా ప్రవృత్తి. ఈ రెండూ కలిపి యజ్ఞము లేదా నివృత్తి కర్మ అనబడతాయి, ఈ రెండు రకముల పనులకు సంబంధించిన ఫలితములు ఆ జీవాత్మను కట్టలేవు. (**యజ్ఞార్థాత్ కర్మణోఽన్యత్ర, లోకోఽయం కర్మబంధనః...**గీతా). యజ్ఞమునకు భగవదారాధన మరియు భగవన్నివేదనము అనే రెండు ముఖ్యమైన అర్థాలు ఉన్నాయి కానీ అగ్నిలో ఆహారమును నశింపజేయమని కాదు. యజ్ఞము యొక్క ఆధారమేమిటంటే స్థిరమైన జీవనభృతిని సంపాదించుచూ దానిని కలిగి ఉండటము (జీవనభృతి యందు కొంత స్థిరత్వము గల జనులు యజ్ఞాదిక్రతువులు చేయుటకు యోచిస్తారు). ఇది కూడా ప్రవృత్తియే కాబట్టి ఆ పని ప్రవృత్తి కింద పరిగణింపబడదు. ఇది నివృత్తి లేదా యజ్ఞములోనే భాగమవుతుంది. ఇలా చేసే యజ్ఞములో ఫలితములు జీవాత్మతో బంధమును కలిగి ఉండవు. జీవనభృతికి మించి పాపకర్మల ద్వారా సంపాదించుట కేవలము ప్రవృత్తిలోనికే చేరును కానీ అది నివృత్తిలో చేరదు. అటువంటి

కర్మ మాత్రమే జీవుని బంధించును అని పై గీతాశ్లోకములో కర్మబంధనః అను శబ్దమునకు సమన్వయము చేసుకొనవలెను. కౌరవులకు వ్యతిరేకముగా యుద్ధము చేయడము భగవంతుని యొక్క కర్మ లోకి వస్తున్నది. ఆ రకముగా ధర్మమును వృద్ధి చేయడము మరియు అధర్మమును నాశనము చేయడము భగవత్కర్మ. పాండవులు తమ కుటుంబాల పోషణ కోసము అభ్యర్థించిన ఐదు ఊళ్ళను ఏర్పాటు చేసుకోవడము పాండవుల జీవనభృతి అను కర్మ కూడా నివృత్తి లోనికే చేరుచున్నది. అర్జునుడు తన న్యాయబద్ధమైన భాగమును కూడా కోరడము లేదు, లేదా విలాసమయ జీవితము కోసము సంపూర్ణ రాజ్యము కొరకును యుద్ధము చేయడము లేదు. జీవనభృతిని కూడా నిరాకరించిన కౌరవులతో యుద్ధము చేయుచున్నాడు. అటువంటి యుద్ధములో అతడు తన తాతను, గురువును చంపడము అనే పాపకర్మ (*వికర్మ*)ను చేయవలసి వస్తున్నది. దీనిని నివారించుటకు అతడు యుద్ధము లేదా యజ్ఞము నుండి విరమించుకో(*అకర్మ*) దలిచాడు. తాను రాజ్యమును కోరి యుద్ధము చేయవలసి ఉన్నందున అటువంటి మార్గములో విలాసాలను కూడా పొందవలసి ఉన్నందున, అట్టి పాపకర్మను తాను ఎంచుకున్నాను అని భ్రమ పడినాడు. కానీ, తాను చేయబోవు యుద్ధము నివృత్తి లోనికే వచ్చుచున్నది కావున, బంధు వ్యామోహమును విడనాడియైననూ యుద్ధము చేయవలయునను సత్యమును మరచినాడు. తాను చేయబోవు యుద్ధము భగవంతుని ధర్మస్థాపన కర్మ లోకి వచ్చునను విషమును కూడా మరచినాడు. కృష్ణుడు దీనికి వివరణ ఇస్తూ యుద్ధము అర్జునుని వ్యక్తిగత కార్యము కాదని అది భగవంతుని దివ్యమైన కర్మ లేదా యజ్ఞము అనియూ, ఎందుకంటే ఇందులో వారి జీవనోపాధి కోరిక కూడా మిళితమై ఉందనీ కావున ఇది వారికి యజ్ఞమేనని తెలిపినాడు. యజ్ఞము అంటే భగవంతుని కర్తవ్యములో భాగస్వామి కావటము. అనగా యజ్ఞము అను పదము కర్మవిశేషమే (**యజ్ఞః కర్మ సముద్భవః -** గీతా) తప్ప ఆహారమును కాల్చివేయడము వంటి కర్మ (వికర్మ) యజ్ఞము కాదు.]

**నిష్ఫలం కర్మ చా కర్మ, యజ్ఞ ఏవ హి జీవితమ్ |**
**త్యాజ్యం వికర్మ యజ్ఞే తత్, సద్గురోరేవ నిశ్చయః || 15.20||**

[కర్మల చేత లేదా యజ్ఞము చేత నిండిన జీవితము పరిపూర్ణమైనది. అంటే భగవంతుని సేవను నిర్దేశించి గడిపినట్టి ఈ జీవితములో నిత్యజీవనభృతికి సంబంధించిన పనులు కూడా కలిసే ఉంటాయి. అధర్మబద్ధమైన పనులు చేసి సంపాదించిన సొమ్ము విలాసాలకు, స్వార్థప్రయోజనములకు వాడితే అది పాపకర్మ లేదా వికర్మ కావున భగవంతుని చేత శిక్షింపబడుతుంది కావున పూర్తిగా వీటిని నిషేధించవలెను. అకర్మ అంటే అసలు పని చేయకపోవడము లేదా పనిని వృథా చేయడము కావున దీనిని కూడా నిషేధించవలెను. (**మా తే సంగోఽస్త్వకర్మణి-** గీతా). వేదోక్తిని అనుసరించి ఒకవేళ ప్రాథమిక అవసరాల కోసం మరియు భగవంతునికి చేసే నివేదనల కొరకు మాత్రమే చేసే కర్మలు ఆ జీవాత్మను కట్టలేవు. (**తేన త్యక్తేన భుంజీథాః - వేదము**). తాతను, గురువును చంపినప్పటికీ అది పాపము కాదని జగద్గురువైన శ్రీకృష్ణ భగవానుడు నిర్ణయించిన విధముగా యజ్ఞము చేసేటప్పుడు పాపకర్మ లేదా వికర్మ అనే సంశయము వస్తే, ఆ నిమిషానికి సద్గురువును సంప్రదించి వారి నిర్ణయమును అనుసరించవలసినదే. శ్రీకృష్ణుడు తాతను, గురువును చంపమని అర్జునుని ఆదేశించుటలో పాపము లేకపోవుటకు కారణము వారు అధర్మమును మొదటినుండియూ సమర్థించుటయే కావున సద్గురువు ఉపదేశించు బోధలో ఎట్టి అజ్ఞానమూ ఉండదు.]

**ఇతి త్రైలోక్యగీతాయాం యజ్ఞ విచార యోగో నామ పంచదశాధ్యాయః**
**ఈ విధముగా త్రైలోక్యగీత యందు పదిహేనవ అధ్యాయము అయిన 'యజ్ఞ విచార యోగము' పరిసమాప్తము.**